క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో పూజలు



మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం ఉడా కాలనీలోని మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ బాబాకు హారతి, మేలుకొల్పు పూజలు చేపట్టారు. అనంతరం పంచామృతాలు, విభూదితో అభిషేకం చేశారు. అభిషేకాల తర్వాత బాబాకు పట్టు వస్త్రాలు, వెండి ఆభరణాలు, సుగంధ మాలలతో అలంకరణ చేశారు. ఉదయం 8 గంటలకు స్థానిక భక్తులు బాబా కీర్తనలను ఆలపించారు. మధ్యాహ్నం పలువురు భక్తులకు అన్న సమారాధన నిర్వహించగా, సాయంత్రం హారతి పూజలు, పల్లకీ సేవ నిర్వహించారు.

పంట పొలాల పరిశీలన



కొత్తపాలెంలో పంట పొలాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ దాడి వెంకటరమేష్

గోపాలపట్నం: పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతుల సంక్షేమం కోసం రూపొందించిందని 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ అన్నారు. కొత్తపాలెం పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. మంచి దిగుబడిని సాధించేందుకు ఏ విధమైన సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



మధురానగర్ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సురేష్

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్‌లో 400 మంది విద్యార్థులకు పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్.సురేష్ కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 40 మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తుందన్నారు. జిల్లాలోని 595 పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్లు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ నెలాఖరు వరకు జరుగుతుందన్నారు.

25.2 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం నిర్వహించిన తనిఖీల్లో 25.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది, ఆర్పీఎఫ్ ఎస్ఐ దినేష్‌కుమార్ దాస్‌లు స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. మహారాష్ట్ర థానే జిల్లాకు చెందిన మొహమ్మద్ ఉమర్ మున్నావర్ షేక్, ఒడిశా గజపతి జిల్లాకు చెందిన శక్తిమాన్ జేనా, సీను రైతాలు విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా ముంబైకు గంజాయిని అక్రమంగా తరలించడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.1.26 లక్షల విలువైన 25.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

28 నుంచి ఉద్యోగార్థులకు శిక్షణ తరగతులు

డాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యోగ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్టు నిర్వాహకుడు డాక్టర్ బి.గంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. అటవీశాఖ ఉద్యోగాలకు, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు తరగతులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ నెల 28 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గాని, 9315015015 నంబరులో గాని సంప్రదించాలన్నారు.

ఆక్రమణలకు అడ్డేదీ..?

- ఎన్ఏడీ ఫ్లై ఓవర్ చుట్టూ కంటైనర్ల దుకాణాలు
- జోరుగా మద్యం విక్రయాలు
- కూటమి నేతలకు నెలవారీ వసూళ్లు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం



ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేసిన కంటైనర్ దుకాణాలు

అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు

నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే ఎన్ఏడీ కూడలిలో వ్యాపారాలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎన్ఏడీ సెంటర్ చుట్టూ అక్రమ దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. అయితే, ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు నిర్వహించుకు నే వారిపై కఠినంగా వ్యవహరించే జీవీఎంసీ అధికారులు, ఫ్లై ఓవర్ కింద వెలుస్తున్న కంటైనర్ దుకాణాల వైపు కన్నెత్తి చూడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కూటమి నాయకుల అడుగులకు మడుగులు ఎత్తుతూ, ఫ్లై ఓవర్ కింద స్థలాల ఆక్రమణదారులకు జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సిబ్బంది సైతం సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

విశాఖ విద్య: నగరానికి తలమానికంగా నిలుస్తున్న ఎన్ఏడీ ఫ్లై ఓవర్ ఇప్పుడు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లి తీవ్ర వివాదానికి దారి తీస్తోంది. ఫ్లై ఓవర్ కింద ఉన్న నాలుగు వైపులా గల రోడ్లపై కంటైనర్ దుకాణాలు వెలుస్తుండటం, వాటికి విద్యుత్ మీటర్లు సైతం మంజూరు చేస్తుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

వ్యాపార కూడలిగా మారిన ఎన్ఏడీ ఫ్లై ఓవర్ చుట్టూ ఉన్న ఖాళీ స్థలాలు, ఫుట్‌పాత్‌లలో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. అధికార కూటమికి చెందిన ఓ వార్డు నాయకుడు నెలవారీ అద్దె ఒప్పందం చేసుకుని, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో దుకాణాలు పెట్టిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫ్లై ఓవర్ కింద కంటైనర్ దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గాజువాక వైపు వెళ్లే దారిలో ఒక దుకాణం నిర్వాహకుడి నుంచి కూటమి వార్డు నాయకుడు రూ. 50 వేలు డిమాండ్ చేసినట్లు, డబ్బు ఇవ్వకపోతే దుకాణం తెరువనీయబోనని హెచ్చరించినట్లు పుకార్లు షికారు చేస్తున్నాయి. కూటమి పాలనలో ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌ను అమ్మకానికి పెట్టేస్తారేమోనని ఈ ప్రాంత వాసులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

మద్యం, గంజాయి విక్రయాలు

ఎన్ఏడీ చుట్టూ ఆక్రమిత స్థలాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గాజువాక వైపు వెళ్లే దారిలో ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేసిన కొన్ని దుకాణాల్లో గంజాయి సైతం విక్రయిస్తున్నారనే ప్రచారం స్థానికంగా ఉంది. సమీపంలో జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉండటంతో, ఆ మార్గంలో వెళ్లే విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ దుకాణాల్లో దొరికే మత్తు పదార్థాలకు విద్యార్థులు ఆకర్షితులై, తమ జీవితాలను ఛిద్రం చేసుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రాత్రి వేళల్లో ఈ ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారి, మద్యం సేవించి హంగామా సృష్టించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యుత్ మీటర్ల మంజూరులో మతలబు

ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడానికి సవాలక్ష నిబంధనలు పెట్టే విద్యుత్ శాఖ అధికారులు, ఆక్రమిత స్థలాల్లో దుకాణాలకు మాత్రం అడిగిందే తడువుగా మీటర్లు మంజూరు చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్లై ఓవర్ కింద ఇటీవల కాలంలో వెలుస్తున్న కంటైనర్ దుకాణాలకు విద్యుత్ మీటర్లు సైతం మంజూరు చేశారు. జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ నుంచి అనుమతులు ఉన్నాయని, ఫ్లై ఓవర్ కింద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వహించే కొంతమంది చెబుతున్నారు. ఫ్లై ఓవర్ కింద దుకాణాల నిర్వహణకు అనుమతులు ఇవ్వడం, వీటికి విద్యుత్ మీటర్లు సైతం ఏర్పాటు చేస్తుండటంపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వ పాలనలో డబ్బులు ఇస్తే ఏదైనా సాధ్యమేనా అనే ప్రశ్నలు ప్రజానీకం నుంచి వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు ఒకసారి పరిశీలన చేసి, ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కింద సాగుతోన్న అక్రమ వ్యాపారాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

వేలాడుతున్న విద్యార్థులు



ఆర్టీసీ బస్సులో వేలాడుతున్న ప్రయాణిస్తున్న విద్యార్థులు

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతాలకు చెందిన చాలా మంది యువ విద్యార్థులు తమ కళాశాలలు, ఐటీఐ, ఇంజినీరింగ్ కళాశాలలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. అయితే బస్సు లోపల ఖాళీ ఉన్నప్పటికీ, కొందరు విద్యార్థులు బస్సులకు వేలాడటానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. బస్సుల్లో వేలాడటం అత్యంత ప్రమాదకరమని, పొరపాటున జారితే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని తెలిసినా, దీనిని వారు పెడచెవిన పెడుతున్నారు. యువత ఈ నిర్లక్ష్యం కారణంగా తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవు తున్నారు. ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి, బస్సుల్లో వేలాడే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వడం గానీ, లేదా చిన్నపాటి హెచ్చరికలు వంటి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అయ్యంకి సేవలు చిరస్మరణీయం



వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

మల్కాపురం: గ్రంథాలయ ఉద్యమానికి పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య చేసిన సేవలు చిరస్మరణీయం అని కళారత్న సుంకర చలపతిరావు అన్నారు. అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా గురువారం మల్కాపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలపతి రావు మాట్లాడుతూ గ్రంథాలయాలను అయ్యంకి ప్రజలకు చేరువ చేశారని కొనియాడారు. ప్రజలంతా విజ్ఞానవంతులు కావాలన్నదే ఆయన లక్ష్యం అని, ఆయన స్ఫూర్తితో యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని, విజ్ఞానవంతమైన సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి. శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, దేవాలయాల కంటే గ్రంథాలయాలు ముఖ్యమని భావించిన వ్యక్తి అయ్యంకి వెంకటరమణయ్య అని అన్నారు. ఆయన స్ఫూర్తితో మరిన్ని గ్రంథాలయాలను ఏర్పాటు చేసి విజ్ఞాన దీపాన్ని వెలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థులకు గ్రంథాలయాల గొప్పతనంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, చిత్రకారుడు శ్రీనివాస్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళి

గోపాలపట్నం: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి సందర్భంగా గోపాలపట్నం పౌర గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.ఎస్.వి. శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రంథాలయాల స్థాపనకు అయ్యంకి వెంకటరమణయ్య చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.వి. నరసింహం, సచివాలయ ఉద్యోగి సి.హెచ్. భాస్కరరావు, పాఠకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ తరగతులు ప్రారంభం



డ్రైవర్లకు సూచనలిస్తున్న ఆర్టీసీ జిల్లా అధికారి అప్పలనాయుడు

గోపాలపట్నం: ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సింహాచలం ఆర్టీసీ డిపోలో గురువారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ప్రజా రవాణా విశాఖ జిల్లా అధికారి బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క డ్రైవర్ స్టాపుల్లో బస్ ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని, వారు దిగే వరకు వేచి ఉండాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఒత్తిడి ఉంటుందని, దాన్ని అధిగమించేలా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంపై విధివిధానాలను బట్టి టికెట్లు ఇవ్వాలని సూచించారు. డిపో మేనేజర్ శరత్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ రమణ మూర్తి, అసిస్టెంట్ ఇంజినీర్ సుధారాణి పలు అంశాలపై డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు.

గర్భిణులకు బేబీ కిట్ల పంపిణీ



బేబీ కిట్లు అందుకున్న గర్భిణులతో రోటరీ క్లబ్ సభ్యులు

కంచరపాలెం: రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ మెట్రో ఆధ్వర్యంలో మాతా, శిశు ఆరోగ్య మాసం సందర్భంగా గురువారం కప్పరాడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గర్భిణులకు బేబీ కిట్లు, పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కూటికుప్పల రవికిరణ్ ప్రసాద్ మాట్లాడుతూ మహిళలకు శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రతి ఏడాది రోటరీ ఇంటర్నేషనల్ మాతా శిశు ఆరోగ్య మాసంగా పాటిస్తుందని తెలిపారు. సమాజంపై రోటరీ కలిగిన బాధ్యతను ప్రతిబింబిస్తోందన్నారు. సంస్థ సేవా కార్యక్రమాలపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.బి.రెడ్డి, శీల, సునిత లావణ్య మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్, హరిథా, గైనకాలజీ డాక్టర్ పి.శిరీష, డాక్టర్ సుష్మిత, డాక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


విజువల్ పోలీసింగ్‌తో ప్రజలకు భద్రత



కప్పరాడ జంక్షన్‌లో విజువల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న సీఐ రవికుమార్

మర్రిపాలెం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బగ్చి ఆదేశాల మేరకు ప్రజలకు భద్రతతోపాటు గంజాయి, మాదకద్రవ్యాలు వంటి నేరాల నియంత్రణపై గురువారం కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవికుమార్ విజువల్ పోలీసింగ్ నిర్వహించారు. కప్పరాడ జంక్షన్‌లో సిబ్బందితో కలిసి విధులు నిర్వహించారు. అక్కడి వచ్చి వెళ్లే వారితో ఆయన మాట్లాడుతూ నేరాలు, ప్రమాదాలపై తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ తరహాలోనే విజువల్ పోలీసింగ్ ద్వారా నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టవచ్చని సీఐ అన్నారు. నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల కట్టడికి విజువల్ పోలీసింగ్‌ను మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తామని చెప్పారు.

ద్విచక్ర వాహనాల తనిఖీ



ద్విచక్ర వాహన చోదకులను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు ద్విచక్ర వాహనదారుల వద్ద పత్రాలు పరిశీలించారు. హెల్మెట్ ధరించని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. వాహన చోదకులు సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గోపాలపట్నం: ఇందిరానగర్ పోలీస్‌స్టేషన్ ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. గోపాలపట్నం బంక్ ప్రాంతం, నరసింహానగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు, పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వెంకటాపురం ఫీడర్ పరిధిలో వెంకటాపురం ఆర్ఆర్‌వెంకటాపురం, అజంతాపార్క్, ఎస్సీబీసీ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.


రోల్‌బాల్ పోటీల విజేతలకు అభినందన



రోల్‌బాల్ క్రీడాకారులతో విప్ గణబాబు

గోపాలపట్నం: రోల్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ప్రభుత్వ విప్ గణబాబు అభినందించారు. ఆయనను క్యాంప్ కార్యాలయంలో గురువారం క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 19, 20 తేదీల్లో కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ 11, 14, 17, 17 ఏళ్ల వయసు మించిన వారి విభాగాల్లో స్థానిక క్రీడాకారులు బంగారు, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించి విశాఖకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోల్‌బాల్ స్టేట్ అసోసియేషన్ సెక్రటరీ అనీల్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ లలిత ప్రియ, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పర్యటించారు. రుసుము చెల్లించి వాడుకునే మరుగుదొడ్లు, పార్కింగ్ ప్రదేశాలు, వెయిటింగ్ హాల్స్, పాదచారుల వంతెనలు, లిఫ్టులు, వాటర్ బూత్‌లు, కేటరింగ్ స్టాళ్లు, ప్లాట్‌ఫారాలు, పార్సిల్ కార్యాలయాలను డీఆర్ఎం తనిఖీ చేశారు. ప్రయాణికుల సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించి, అధికారులకు సూచనలిచ్చారు.

క్షయ నిర్మూలనలో భాగం కండి

మర్రిపాలెం: ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో ప్రతి ఒక్కరూ భాగం కావాలని స్థానిక యూపీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది పిలుపునిచ్చారు. 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ వద్ద గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సాసుబిల్లి అనూష మాట్లాడుతూ క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. టీబీ కేసుల గుర్తింపును వేగవంతం చేయడం, మరణాలను తగ్గించడంతోపాటు కొత్త కేసులను నిరోధించడంలో భాగంగా 60 ఏళ్లు దాటిన వారికి బీఎంఐ, 18 ఏళ్ల లోపు వారికి, సుగర్ వ్యాధిగ్రస్తులకు, ధూమ, మద్యపానాలు చేసే వారికి కళ్ల పరీక్షలు నిర్వహించి, ఎక్స్‌రే తీసి వ్యాధి నిర్ధారణ చేస్తామన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటం వంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. క్షయ వ్యాధి ఉన్నవారు ప్రభుత్వం ఉచితంగా అందించే మందులను ఆశా వర్కర్ పర్యవేక్షణలో వాడాలన్నారు. అనంతరం టీబీ రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు మాజీ కార్పొరేటర్ నర్సకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ మధు, సూపర్‌వైజర్ సూర్యనారాయణ, మణి, ఏఎన్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు



58వ వార్డులో నిరసన ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: అదానీ స్మార్ట్ మీటర్లు మాకు వద్దే వద్దంటూ గురువారం సీపీఎం నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. 58వ వార్డు ఉప్పరా కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్ పెట్టి ప్రజల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అదానీ సంస్థతో పాలకులు చేతులు కలిపి పేదలను మరింత ఆర్థిక ఇబ్బందులకు గురిచేసేందుకు సన్నాహాలు రచిస్తున్నారన్నారు. కూటమి సర్కార్‌కు ధనికులు తప్పా.. పేదల బాధలు పట్టావా అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన మరుక్షణం విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను ప్రోత్సహించమని ప్రసంగాలు చేసిన కూటమి నేతలు నేడు ఏం సమాధానం చెబుతారన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆలోచనను ఉపసంహరించుకోవాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. 60వ వార్డు గుల్లలపాలెంలోని ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రిని ప్రభుత్వమే నిర్వహించాలని, కోరమాండల్ వంటి ప్రైవేట్ సంస్థకు అప్పగించి పేదల ఆరోగ్య సమస్యలను గాలికి వదిలేయవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉరుకూటి బాబూరావు యాదవ్, ఆర్.లక్ష్మణమూర్తి, పైడిరాజు, పెంటరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యుత్ చార్జీల మోత



కంచరపాలెం కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కంచరపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడానికి, స్మార్ట్ మీటర్లు బిగించడానికి చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలు నడ్డివిరిచారని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి వస్తే ప్రజలు వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చిన చంద్రబాబు, లోకేష్‌లు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నాలుగు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.15.48 కోట్లు భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపారని తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నెయ్యల నాగభూషణరావు, వాసుపల్లి మల్లయ్య, నెలివాడ అప్పన్న, ఆడారి ఆదినారాయణ, సత్యవతమ్మ, నూకాలమ్మ, అప్పలకొండ, రవి తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు దిగ్దర్శనం' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య నాగేశ్వరరావు

సీతంపేట: భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ బీవీకే కళాశాలలో డాక్టర్ తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో ప్రచురించిన విశిష్ట తెలుగు దిగ్దర్శనం గ్రంథావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథి ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూమాటి సంజీవరావు తెలుగు భాష ప్రాచీన ప్రతిపత్తి కోసం ఒంటరి న్యాయ పోరాటం చేసి సాధించారని ప్రశంసించారు. సంజీవరావును ఘనంగా సన్మానించారు. సభకు అధ్యక్షత వహించిన బీవీకే కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషపై మమకారం పెంచుకోవాలని, తెలుగులో రాయడం, పద్యాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథ సమీక్ష చేసిన డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ తెలుగు భాష పుట్టుపూర్వోత్తరాలు, క్రమ పరిణామం, సాహిత్య వికాసం, ప్రాచీన ప్రతిపత్తి కోసం సంజీవరావు చేసిన పోరాటం మొదలైన అంశాలపై 25 మంది భాషా సాహితీవేత్తలు రచించిన వ్యాసాలను సంకలనంగా రూపొందించి తెలుగువారికి అమూల్యమైన గ్రంథాన్ని అందించారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రత్నశేఖర్, తెలుగు అధ్యాపకులు మోహనరావు పాల్గొన్నారు.

'పాదుపు పద్య శతకం' పుస్తకావిష్కరణ

సాహిత్య సురభి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆచార్య పేరి సర్వేశ్వర అవధాని, ఆచార్య బి.ఎస్.కె.సుందర శివరావు రచించిన పాదుపు పద్య శతకం పుస్తకావిష్కరణ జరిగింది. వృద్ధుల కల్యాణ రామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత కృషి యువతరాన్ని ఆకట్టుకునేలా ఉందన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, ఓరుగంటి రాజరాజేశ్వరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.